క్లుప్తంగా

రామాలయానికి శంకుస్థాపన



కూనవరంలో కోదండ రామాలయానికి శంకుస్థాపన చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: కూనవరంలో కోదండ రామాలయానికి వైఎస్సార్ సీపీ సీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఆలయ నిర్మాణం త్వరగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. గ్రామం సుభిక్షంగా ఉండటానికి ఇదెంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, సర్పంచ్ సుంకర గంగాలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండలో బుధవారం జరిగిన కోదండ రామాలయం విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. కోదండ రామాలయానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.20 లక్షలు విరాళంగా ఇచ్చారు.

పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న వీసీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ అమ్మిరెడ్డి మల్లిడి రచించిన ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్' పుస్తకాన్ని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ బుధవారం ఆవిష్కరించారు. అంతర్జాతీయంగా ఆర్థిక విషయాలపై ఈ పుస్తకం మంచి అవగాహనను కలిగిస్తుందన్నారు. అలాగే ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన అమరావతి ఆర్ట్ ఫెస్టివల్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు, ఆర్ట్ అండ్ హస్తకళలలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను వీసీ అభినందించారు.

ప్రపంచ పుస్తక దినోత్సవం

రాజానగరం: ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని బుధవారం స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ షేక్ మీరా మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద డిజిటల్ లైబ్రరీగా నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా (ఎన్‌డీఎల్ఐ) ఉందన్నారు. ఈ సందర్భంగా రీడ్ యువర్ వే థీమ్ పేరుతో విద్యార్థులు, అధ్యాపకులకు క్విజ్, బుక్ రివ్యూ పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. న్యాయనిర్ణేతగా డాక్టర్ గోపి వ్యవహరించారు.

సెలవులను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

రాజానగరం: విద్యార్థులు వేసవి సెలవులను సరైన ప్రణాళికతో సద్వినియోగం చేసుకోవాలని సీబీఐ రిటైర్డ్ ఉన్నతాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. నామవరంలోని భారతీయ విద్యా భవన్‌లో బుధవారం జరిగిన విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పిల్లల పెంపకంలో గురువుతో పాటు, తల్లిదండ్రులు కూడా కలిస్తేనే విద్యార్థులు ఉన్నతంగా తయారవుతారన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో రంజింపజేశారు.

కొవ్వొత్తుల ర్యాలీ

సీతానగరం: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ బీజేపీ మండల అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుంచి నాలుగు బొమ్మల సెంటర్ మీదుగా ర్యాలీ కొనసాగింది.

నూతన టాయిలెట్స్‌కు ప్రతిపాదనలు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ఆర్టీసీ బస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించే మరుగుదొడ్లకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని ఆర్టీసీ డీపీటీవో షర్మిల అశోక్ తెలిపారు. బుధవారం స్థానిక బస్ స్టేషన్‌ను ఆమెతో పాటు, గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత మార్గరెట్ పరిశీలించారు. మరుగు దొడ్ల నిర్మాణానికి బస్ స్టేషన్ ఆవరణలోని స్థలాన్ని పరిశీలించారు. రూ.35 లక్షల అంచనాతో ప్రతిపాదనలు పంపుతామని, మంజూరైన తక్షణమే పనులు ప్రారంభిస్తామని షర్మిల అశోక్ తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ

సీతానగరం: మిర్తిపాడులో సుంకవల్లి లక్ష్మీబేబి ఇంటిలో బంగారు ఆభరణాలు, నగదు చోరీపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ బుధవారం తెలిపారు. బాధితురాలు మంగళవారం రాత్రి తన తల్లి వద్దకు వెళ్లింది. బుధవారం ఉదయం ఇంటికి వెళ్లగా, ఇంటి తలుపు, బీరువా పగులగొట్టి ఉన్నాయి. పది కాసుల బంగారు ఆభరణాలు, వెండి పూజా సామగ్రి, రూ.20 వేలు చోరీ అయినట్టు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పదింతల ఆనందం

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ
- మండలంలో 88 శాతం ఉత్తీర్ణత



దాసరి జయమణిమంగ



అంగటి వెంకటలక్ష్మి



లక్ష్మీ ప్రియాంకర్



కోశెట్టి శ్యాంకుమార్



తేజశ్రీ



పవిత్ర



కేహెచ్ఎస్‌వీవీ కృష్ణ



పి.శ్రీవిజయ



జి.రమ్యశ్రీ



జాహ్నవి

బిక్కవోలు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. బుధవారం మండల వ్యాప్తంగా 601 విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, వీరిలో 529 మంది ఉత్తీర్ణులై 88 ఉత్తీర్ణత శాతం సాధించారు. బిక్కవోలు ఉన్నత పాఠశాల 74 శాతం, ఊలపల్లి 91, బలభద్రపురం 78, ఇలపల్లి 81, కాపవరం 92, కొంకుదురు 92, మెళ్లూరు 92, పందలపాక 94 శాతం ఉత్తీర్ణత సాధించాయి. బిక్కవోలు ఉన్నత పాఠశాలకు చెందిన దాసరి జయమణి మంగ (582) అత్యధిక మార్కులు సాధించింది. కొంకుదురుకు చెందిన అంగటి వెంకటలక్ష్మి(575) ద్వితీయ స్థానం సాధించింది. బిక్కవోలులో యోరికె వీర నాగవినయ్ (537), వరదా లావణ్య(535), కొంకుదురులో వెల్ల శ్రావ్యాంజలి (548), రెడ్డి శ్రావ్యవర్షిత (545), పందలపాకలో పిల్లా దివ్యశ్రీ (542), మాడెం దుర్గాభవాని (541), ఊలపల్లిలో వాసపు జేవీవీ వరప్రసాద్(520), పెంటపాటి ప్రసన్న గీతాశ్రీ (519), బలభద్రపురంలో ఎం.ఉదయ జస్వంత్ (540), ఎం.మహాలక్ష్మి(533) స్థానాలు సాధించారు.

సత్తా చాటిన విద్యార్థులు

రంగంపేట: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. రంగంపేట మండలంలోని పది జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 573 మంది విద్యార్థులు హాజరు కాగా, 481 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. వడిశలేరు జెడ్పీ పాఠశాల విద్యార్థి ఎ.లక్ష్మీ ప్రియాంకర్ (583) మండల టాపర్‌గా, రంగంపేట జెడ్పీ విద్యార్థి కోశెట్టి శ్యాంకుమార్ (581) ద్వితీయ, వడిశలేరు జెడ్పీ విద్యార్థి పీహెచ్ఎస్‌వీవీ కృష్ణ (576) తృతీయ స్థానం సాధించారు. వీరిని ఎంఈఓలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు అభినందించారు.

అనపర్తి మండలంలో..

పెదపూడి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అనపర్తి మండలంలో 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 556 మందికి 523 మంది ఉత్తీర్ణులై, 94 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓలు బి.పుష్పలత, నల్లమిల్లి సత్తిరెడ్డి తెలిపారు. రామారెడ్డి జెడ్పీ విద్యార్థి 592 మార్కులు, కుతుకులూరు జెడ్పీ విద్యార్థి 587, అనపర్తి జెడ్పీ బాలికోన్నత విద్యార్థిని 584 మార్కులు సాధించినట్టు చెప్పారు.

94 శాతం ఉత్తీర్ణత

కోరుకొండ: పదో తరగతి పరీక్షలకు 1,160 మంది విద్యార్థులు హాజరు కాగా, 1,087 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 94 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు కోరుకొండ ఎంఈఓలు టి.కుశలవదొర, ఎం.సుజాత తెలిపారు. శ్రీరంగపట్నం జెడ్పీ పాఠశాలకు చెందిన పెంటకోటి శ్రీవిజయ (578) ప్రథమ స్థానాన్ని, గాదరాడ జెడ్పీ పాఠశాలకు చెందిన జి.రమ్యశ్రీ (577) ద్వితీయ స్థానం పొందారు. గుమ్ములూరు, శ్రీరంగపట్నం జెడ్పీ స్కూళ్లకు చెందిన గౌతమి, కావ్య శ్రీ,సాయి, జగన్‌బాబీ (569) మార్కులతో తృతీయ స్థానాన్ని సాధించారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులను ఎంఈఓలు అభినందించారు.

కలవచర్ల నూరు శాతం

రాజానగరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో మండలంలో 87.37 శాతం ఉత్తీర్ణతను సాధించామని ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 1,180 మంది విద్యార్థులు పరీక్షలను రాయగా, వీరిలో 1,031 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 15 ప్రభుత్వ పాఠశాలల నుంచి 759 మందికి 621 మంది ఉత్తీర్ణతతో 81.81 శాతం ఫలితాలను అందుకున్నారు. కలవచర్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణతను సాధించింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి అత్యధిక మార్కులు పొందిన వారిలో సంగీత శిరీష (572), చాట్ల అరుణకుమార్ (569) (నరేంద్రపురం), యూవీవీ లక్ష్మీ (569) (తోకాడ), పి.యశ్వంత్ (567) (దివాన్‌చెరువు) ఉన్నారు.

82 శాతం ఉత్తీర్ణత

సీతానగరం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో 82 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ కె.స్వామినాయక్ తెలిపారు. ప్రభుత్వ, జెడ్పీ హైస్కూళ్ల నుంచి 415 మంది పరీక్షలకు హాజరవ్వగా, వీరిలో 341 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్ 86.7 శాతం ఉత్తీర్ణత, స్కూల్ ఫస్ట్‌గా సీహెచ్ మహిమ ప్రభావతి(568), వెదుళ్లపల్లి జెడ్పీ 94 శాతం, స్కూల్ ఫస్ట్‌గా ఎ.మనోహరి (569), చినకొండేపూడి జెడ్పీలో స్కూల్ ఫస్ట్ టి.తేజస్వీ (547), రఘుదేవపురం జెడ్పీ 87 శాతం, స్కూలు ఫస్ట్, మండల టాపర్‌గా పి.జాహ్నవి (574) నిలవగా, సెకండ్ టాపర్‌గా కేవీఎస్ కిరణ్(570) నిలిచారని హెచ్ఎం ఎం.శ్యామలాదేవి తెలిపారు. మిర్తిపాడు జెడ్పీ 70 శాతం, బొబ్బిల్లంక ప్రభాకర్‌నగర్ జెడ్పీ 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. వంగలపూడి జెడ్పీ స్కూల్‌లో 54 మంది పరీక్షలు రాయగా, 38 మంది ఉత్తీర్ణత పొందారు.

మండల టాపర్ తేజశ్రీ

పెదపూడి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 91 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓలు కె.సత్యనారాయణ, సీవీవీ సత్యనారాయణ తెలిపారు. మొత్తం 505 మందికి 462 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. సంపర జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పీవీవీఎస్ఎల్ తేజశ్రీ 594 మార్కులతో మండల ప్రథమ, పెద్దాడ జెడ్పీకి చెందిన ఎం.పవిత్ర 576తో ద్వితీయ, జి.మామిడాడ బాలికోన్నత స్కూలుకు చెందిన ఎంఎన్‌డీ జ్యోతిరేఖ, సంపర జెడ్పీకి చెందిన బి.దీపిక 572 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. మండలంలోని ప్రైవేటు స్కూళ్లల్లో 97శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జి.మామిడాడ విద్యార్థులు జి.పుష్పకుమారి, ఎం.గ్రీష్మశ్రీ 595 మార్కులు పొంది మండల టాపర్లుగా నిలిచారు.

నిరుపేదల గృహాలు తొలగిస్తారా?

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



దోమాడలో బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పెద్దల లేఅవుట్ కోసం కూలీల గృహాలు తొలగించడం సరికాదంటూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి స్థానిక ఎమ్మెల్యేకు హితవు పలికారు. దోమాడ గ్రామంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఆర్అండ్‌బీ అధికారులు, రెవెన్యూ అధికారులు పోలీసు బందోబస్తుతో 8 గృహాలను తొలగించారు. బాధితులను సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 70 ఏళ్లుగా నివసిస్తున్న కుటుంబాలకు కరెంటు బిల్లు, ఇంటి, కుళాయి పన్నుల రసీదులు ఉన్నాయన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులతో నిరుపేదలపై దౌర్జన్యానికి పాల్పడతారా అంటూ ఎమ్మెల్యేపై మండిపడ్డారు. లేఅవుట్ యజమాని వద్ద మాముళ్ల కోసం పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారంటూ ఆరోపించారు. గతంలో పెదపూడి, పందలపాక, రాజుపాలెం గ్రామాల్లో ఇలాగే దౌర్జన్యంగా తొలగించారన్నారు. అన్ని చోట్లా ఆక్రమణలు తొలగించలేరా అని ప్రశ్నించారు. అనంతరం ఆయన పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, గృహాల తొలగింపునకు ఏ నోటీసులు ఇచ్చారంటూ పోలీసులను ప్రశ్నించారు. తమ వద్ద ఎలాంటి నోటీసులు లేవని, ఆర్అండ్‌బీ అధికారుల బందోబస్తు కోరితే వెళ్లామని పోలీసులు సమాధానం చెప్పారన్నారు. దోమాడ సర్పంచ్ మీనవల్లి శారదదేవి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, నాయకులు సాంబత్తుల చంటి, గుత్తుల రమణ, ఎంపీటీసీ సభ్యులు పేపకాయల వెంకటరమణ, కట్టా విజయరాజు, దున్నె అప్పారావు, జగదీష్, పంపన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేత అన్యాయం

దోమాడలో ప్రభుత్వ అండదండలతో గృహాలను దౌర్జన్యంగా కూల్చివేయడం చాలా అన్యాయమని మాల మహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు ఆరోపించారు. ఈ ఘటనపై సిద్ధాంతుల కొండబాబు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ, దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు చెంగలరావు తదితర ప్రజా సంఘాల ప్రతినిధులు బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితులతో కలిసి ఆందోళన చేపట్టారు. కొండబాబు మాట్లాడుతూ బాధితుల ఇళ్ల వెనుక ఉన్న ప్రైవేట్ వెంచర్ యజమానితో అధికారులు కుమ్మక్కై ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆర్అండ్‌బీ రోడ్డు పొడవున ఉన్న షాపులు, గృహాలు ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంచర్ యజమానికి అమ్ముడయ్యిపోయారని ఆరోపించారు. చెంగలరావు మాట్లాడుతూ మానవ, రాజ్యాంగ, సహజ హక్కుల ఉల్లంఘన జరిగిందన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే హైకోర్టుకు వెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా పోరాడాతమని తెలిపారు.

అధికారుల వివరణ

దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ లోవరాజుని వివరణ కోరగా, దోమాడ పంచాయతీ అధికారులు ఆర్అండ్‌బీ రోడ్డు ఆక్రమణలకు గుర్తైనట్లు తమకు నివేదించారన్నారు. దానిపై తహసీల్దార్‌కు తెలియజేశామన్నారు. రెవెన్యూ, పోలీసు బందోబస్తుతో నిబంధనల ప్రకారం ఆక్రమణలు తొలగించినట్లు తెలిపారు. తహసీల్దార్ పీవీ సీతాపతిరావును వివరణ కోరగా, ఆర్అండ్‌బీ అధికారులు ఆక్రమణలు తొలగింపు విషయంలో సహకరించాలని కోరగా, రెవెన్యూ కార్యదర్శులు అక్కడ వెళ్లారని తెలిపారు. ఎస్సై రామారావును విరవణ కోరగా, ఆర్అండ్‌బీ అధికారులు ఆక్రమణలు తొలగింపుపై బందోబస్తు కోరగా, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా బందోబస్తు నిర్వహించామన్నారు.

సక్రమంగా నిర్వహిస్తారా..?

- వాయిదా వేస్తున్న గోషాయి భూముల వేలం
- బహిరంగ వేలం నిర్వహించాలని రైతుల డిమాండ్



కాటవరం సచివాలయం బోర్డులో పెట్టిన నోటీసు

సీతానగరం: మండలంలోని కాటవరంలో ఉన్న గోషాయి మఠానికి చెందిన (ఎండోమెంట్) భూములు బహిరంగ వేలంపాటలు వాయిదా పడుతూ వస్తోంది. అక్రమ మార్గంలో రైతులకు శిస్తుకు ఇస్తారా, సక్రమంగా బహిరంగ వేలంతో ఇస్తారా అని రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మఠానికి చెందిన సుమారు 52 ఎకరాలను ఎండోమెంట్ అధికారులు బహిరంగ వేలం నిర్వహిస్తామంటూ రెండుసార్లు వేలంపాటలను వాయిదా వేశారు. వివరాల్లోకి వెళ్లితే, రాజమహేంద్రవరంలోని గోడాడ గోషాయి మఠం భూములు కాటవరంలో 191, 269 సర్వే నంబర్లలో 51.68 ఎకరాలు 19 ప్రతులుగా ఉంది. బహిరంగ వేలంపాట నిర్వహించి మూడేళ్ల పాటు పాటదారులకు అందించారు. సుమారు 15 మంది రైతులు ఈ భూముల్లో వ్యవసాయం చేస్తున్నారు. గత నెల 28న కాటవరం సచివాలయంలో ఎండోమెంట్ అధికారుల సమక్షంలో మఠం కార్యనిర్వాహణాధికారి 2025–28 వరకు బహిరంగ వేలానికి సిద్ధమయ్యారు. పొలాల్లో రైతుల పంట ఇంకా ఉన్నందున వేలాన్ని ఏప్రిల్ 23కు వాయిదా వేస్తున్నామంటూ, రైతులతో సంతకాలు తీసుకుని వాయిదా వేశారు. బుధవారం అధికారులు సచివాలయానికి చేరుకుని, బహిరంగ వేలంపాట అనివార్య కారణాలతో వాయిదా పడిందని, బహిరంగ వేలం మరలా ఎప్పుడు అనేది తెలియపర్చుతామని నోటీస్ బోర్డులో నోటీసు ఉంచారు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఎటువంటి సమాచారం అందించకుండా నోటీస్ బోర్డులో లెటర్ ఉంచి వెళ్లిపోవడంతో వారు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ వేలంపాట నిర్వహించకుండా అతి తక్కువ ధరకు భూములను కట్టబెట్టడానికి చూస్తున్నారని ఆరోపించారు. బహిరంగ వేలంపాట నిర్వహిస్తే మంచి ఆదాయం పొందవచ్చని, ఇందులో పాల్గొనడానికి డీడీలు కూడా తీశామని గూడపాటి సురేంద్ర, గూడపాటి శ్రీరామ్, ప్రభావతి తెలిపారు. మఠం భూములను బహిరంగ వేలంపాట జరపాలని వారు డిమాండ్ చేశారు. ఎవరివో ఒత్తిళ్లకు తలొగ్గి వాయిదాలు వేస్తున్నారని వారు ఆరోపించారు. గోషాయి మఠం కార్యనిర్వాహణాధికారి వల్లు శ్రీదేవిని దీనిపై వివరణ కోరగా, ఎకరానికి రూ.7 వేల చొప్పున ఆదాయం వచ్చిందన్నారు. పది రోజుల్లో పత్రికా ప్రకటన ద్వారా పాటదారులకు తెలియపర్చుతామని, ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు.

రాష్ట్ర ఏడో స్థానంలో సంపర విద్యార్థి తేజశ్రీ



సంపరలో తేజశ్రీని అభినందిస్తున్న హెచ్ఎం, సంఘ ప్రతినిధులు, గ్రామ పెద్దలు

పెదపూడి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే ఏడో స్థానంలో సంపర గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పీవీవీఎస్ఎల్ తేజశ్రీ 594 మార్కులు సాధించిందని హెచ్ఎం త్రిమూర్తులు తెలిపారు. సంపరలో బుధవారం ఆయనతో పాటు, గ్రామ పెద్దలు, సంపర ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి వెంకటేశ్వర్లు అభినందించారు. త్రిమూర్తులు మాట్లాడుతూ తమ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో 61 మందికి 59 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో 13 మంది 500కు పైగా మార్కులు సాధించారన్నారు. రెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఎనిమిదేళ్లుగా పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గణనీయమైన ప్రతిభను సాధిస్తున్నారన్నారు. ఈసారి ఏకంగా రాష్ట్రంలోనే ఏడో స్థానం పొందడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తేజశ్రీకి సంఘ ప్రతినిధులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో 'శ్రీమహతి' ప్రభంజనం



కవల వంశీ



మద్దిపాటి దుర్గాగణేష్



గంటా లక్ష్మీప్రసన్న

సీతానగరం: కాటవరంలోని శ్రీమహతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు స్టేట్ 7వ ర్యాంకు 590 మార్కుల చొప్పున ముగ్గురు సాధించారని కరస్పాండెంట్ ఎ.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. విద్యార్థులు గంటా లక్ష్మీప్రసన్న, మద్దిపాటి దుర్గాగణేష్, కవల వంశీ ఈ ర్యాంకు సాధించారని, నియోజకవర్గం, మండలంలోను ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. అలాగే కోమలి జస్మిత, సీహెచ్ సాత్విక్‌వర్మ 588 చొప్పున సాధించి నియోజకవర్గ, మండల ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. అలాగే మద్దుల ఆదర్శిని, కె.బాశ్వంత్ 583 చొప్పున, ఎస్ వెంకట రామచందు, కె.భవ్యశ్రీ 582 చొప్పున, కె.మహేశ్వరి 581, సీహెచ్ శివప్రియ 580 మార్కులు సాధించారన్నారు. 570 మార్కుల పైగా 22 మంది, 550 మార్కుల పైన 38 మంది, 500 మార్కుల పైన 52 మంది పొందారన్నారు. నూరు శాతం ప్రథమ తరగతిలో ఉత్తీర్ణులైనట్టు ఐఐటీ అకడమిక్ డైరెక్టర్ ఎ.సత్యరాం ప్రసాద్ తెలిపారు.

నిరంతర విద్యార్థిగా ఉండాలి

బిక్కవోలు: నిరంతరం అధ్యయనం చేసే వాడే నిజమైన ఉపాధ్యాయుడని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న పాఠశాల ఉపాధ్యాయుడు కంభంపాటి అప్పారావును బుధవారం ఘనంగా సత్కరించారు. నిరంతరం విద్యార్థుల బంగారు భవితకు దిక్సూచిగా వ్యవహరించిన అప్పారావు ఉపాధ్యాయ లోకానికి ఆదర్శప్రాయులని కొనియాడారు. పలువురు ఉపాధ్యాయులు అప్పారావును సన్మానించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన కృష్ణారెడ్డి



వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

పెదపూడి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పార్టీ అధికార ప్రతినిధి, అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి బుధవారం తాడేపల్లిలో కలిశారు. ఎన్నికల అనంతరం అనపర్తి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా ప్రతినిధులపై జరుగుతున్న కక్ష సాధింపు చర్యలు, ఇతర విషయాలను వివరించినట్టు కృష్ణారెడ్డి తెలిపారు. ఎవరూ అధైర్య పడవద్దని అధినేత భరోసా ఇచ్చారన్నారు. పార్టీ ముఖ్యనేతలైన జక్కంపూడి రాజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పార్టీ శ్రేణులకు ప్రతి విషయంలోనూ అండగా ఉంటున్నారని చెప్పారన్నారు. రాష్ట్ర నాయకత్వం కూడా అండగా ఉంటుందని స్పష్టం చేశారని కృష్ణారెడ్డి విలేకరులకు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ పోలవరం కెనాల్ ఫీడర్ పనుల కోసం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామని చెప్పారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, దేవీపట్నం మండలం నేలకోట గ్రామాలకు గురువారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పది పట్టుదలే భవిష్యత్తులో ఉండాలి



శ్యాంకుమార్‌ను అభినందిస్తున్న హెచ్ఎం

రంగంపేట: పదో తరగతిలో ఉన్న కృషి, పట్టుదలే భవిష్యత్తు విద్యలో ఉండాలని హెచ్ఎం వి.పార్థసారధి సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తీర్ణులైన పదవ తరగతి విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 125 మందికి 114 మంది ఉత్తీర్ణులై 91 శాతాన్ని సాధించడంలో కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని, విద్యార్థులను ఆయన అభినందించారు. 500 మార్కులకు పైగా వచ్చిన 31 మంది విద్యార్థులు ఉన్నారని, 581 మార్కులతో కోశెట్టి శ్యాంకుమార్ ప్రథమ స్థానం, 572 మార్కులతో టి.బాలసూర్యప్రసన్న ద్వితీయ స్థానం, 560 మార్కులతో అడపా వీర రాఘవ తృతీయ స్థానం సాధించగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చేరడానికి సన్నద్ధులు కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చార్లెస్, గణేష్, ఓమి ప్రసాద్, స్వాతికుమారి, సత్యదేవి, శేషకుమారి, వరలక్ష్మి, రాజేశ్వరి, బుల్లెమ్మ, సావిత్రి, భారతి, రమ్యసుధ, వెంకటలక్ష్మి, సత్యవేణి, శైల, జాకబ్ పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 'శ్రీగౌతమి' విజయకేతనం



ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీగౌతమి యాజమాన్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీగౌతమి స్మార్ట్ స్కూల్ విద్యార్థులు ఎల్.లక్ష్మీశ్రీ 594, కె.రచిత 592, ఏ.అమృత 590 మార్కులు సాధించారని స్కూల్ డైరెక్టర్ సుంకర రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 590పైన ముగ్గురు, 580పైన 13 మంది, 570పైన 26 మంది, 550పైన 52 మంది, 500పైన 94 మంది మార్కులు సాధించగా, 141 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు. బుధవారం స్థానిక గాంధీపురంలోని శ్రీగౌతమి ప్రాంగణంలో ఆయా విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో రవికుమార్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ ముందు విద్యార్థులు ఇంకా మంచి మార్కులు, ర్యాంకులను సాధించాలని ఆకాంక్షించారు. తమ విద్యార్థులు అనేక మంది ఐఐటీ, ఎన్ఐటీ, నీట్, ఐఐఎం, సీఏల్లో అత్యున్నత ర్యాంకులు సాధించారన్నారు. మెంటర్ ఆఫ్ హారిజన్ ఫౌండేషన్ బి.గురునాథ్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.